క్లుప్తంగా

రైతులు అప్రమత్తంగా ఉండాలి

నవాబుపేట: రైతులు తొందర పడి ధాన్యం కోతలు, తదితర కార్యక్రమాలు చేపట్టవద్దని.. వర్ష సూచనల ఆధారంగా చర్యలు తీసుకోవాలని మండల వ్యవసాయ అధికారి కృష్ణకిషోర్ సూచించారు. బుధవారం మాట్లాడుతూ తాజాగా రెండు రోజులుగా ఈదురుగాలులు వీస్తున్నాయన్నారు. ఈ నేపథ్యంలో పంటల కోతలపై సూచనలు చేశారు. ధాన్యం కోసిన వెంటనే ఆరాలని.. వాతావరణం అనుకూలించకపోతే తేమ శాతంతో వల్ల గిట్టుబాటు ధరను కోల్పోయే ప్రమాదముందన్నారు. అందువల్ల అప్రమత్తంగా వ్యవహరించి కోతలు చేపట్టాలని పేర్కొన్నారు.

కళలను కాపాడుకుందాం



జడ్చర్ల టౌన్: మండలంలోని బూర్గుపల్లిలో శ్రీకృష్ణ కళామండలి ఆధ్వర్యంలో గురువారం రాత్రి నుంచి చిరుతల శ్రీ మార్కండేయ విలాసం వీధినాటకం ప్రదర్శిస్తున్నట్లు బీసీసేన రాష్ట్ర అధ్యక్షుడు కృష్ణయాదవ్ తెలియజేశారు. బుధవారం గ్రామంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వీధినాటకం వివరాలను గ్రామస్తులకు, విలేకరులకు వెల్లడించారు. అంతరించిపోతున్న కళలను కాపాడాలన్న ఉద్దేశ్యంతో ఇలాంటి కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. బూర్గుపల్లితోపాటు పరిసర గ్రామాల ప్రజలు అధిక సంఖ్యలో హాజరై తిలకించాలని కోరారు. కార్యక్రమంలో పంతులు గోరంట్ల మల్లేష్, గ్రామస్తులు కృష్ణకుమార్, శంకరయ్య, పెద్ద నర్సింహులు, చెన్నకేశవులు, సత్తయ్యలు పాల్గొన్నారు.

నేడు పల్లకీసేవ

జడ్చర్ల టౌన్: బాదేపల్లి పట్టణంలోని సాయి నగర్ సకలదేవతల ఆలయంలో గురువారం మధ్యాహ్నం అన్నదానం చేయనున్నట్లు ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త పాలాది రమేష్ తెలియజేశారు. అదేవిధంగా సాయి పల్లకీసేవ, వ్రతం నిర్వహించి మహామంగళహారతి నివేదించనున్నట్లు వివరించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

వరుసగా ఢీకొన్న మూడు వాహనాలు



అడ్డాకుల: మండలంలోని శాఖాపూర్ శివారులో బుధవారం ఉదయం 44వ నంబర్ జాతీయ రహదారిపై వరుసగా మూడు వాహనాలు ఢీకొన్నాయి. ఘటనలో వాహనదారులకు ప్రమాదం తప్పిపోయింది. కర్నూల్ వైపు నుంచి హైదరాబాద్ వైపు వెళ్లే దారిలో శాఖాపూర్ దాటిన తర్వాత ముందు వెళ్తున్న కారు డ్రైవర్ సడన్ బ్రేక్ వేశాడు. దీంతో వెనుక ఉన్న మరో కారు ముందున్న దానిని ఢీకొట్టింది. ఈ క్రమంలో వెనుక ఉన్న కారును దాని వెనుక ఉన్న బొలేరో ఢీకొట్టింది. వరుసగా మూడు వాహనాలు ఢీకొనగా మధ్యలో ఉన్న కారు ముందు, వెనుక దెబ్బ తినగా మిగిలిన రెండు వాహనాలు స్వల్పంగా దెబ్బతిన్నాయి. ఘటనలో మూడు వాహనాల్లో ఉన్న వారికి ఎలాంటి ప్రమాదం సంభవించలేదు. మూడు వాహనాల్లో ముందున్న కారు స్వల్పంగా దెబ్బతినడంతో వెంటనే అక్కడి నుంచి వారు వెళ్లిపోయారు. మధ్యలో ఉన్న కారు బాగా దెబ్బతినడంతో అందులో ఉన్న వారు కారును అక్కడే ఉంచి మరో వాహనంలో వెళ్లిపోయారు. దీనిపై ఎలాంటి ఫిర్యాదు అందలేదని ఎస్‌ఐ ఎం.శ్రీనివాస్ తెలిపారు.

లారీ బోల్తా : తప్పిన ముప్పు

అడ్డాకుల: మండలంలోని శాఖాపూర్ శివారులో 44వ నంబర్ జాతీయ రహదారిపై బుధవారం మధ్యాహ్నం జరిగిన రోడ్డు ప్రమాదంలో డ్రైవర్‌కు ముప్పు తప్పిపోయింది. రాజస్థాన్‌కు చెందిన లారీ హైదరాబాద్ వైపు నుంచి కర్నూల్ వైపు వెళ్తుండగా టోల్‌ప్లాజా సమీపంలోని దాబా వద్ద కారును తప్పించే క్రమంలో అదుపు తప్పి రోడ్డు పక్కకు బోల్తాపడింది. లారీ క్యాబిన్‌లో ఉన్న డ్రైవర్ స్వల్ప గాయాలతో బయటపడ్డాడు. లారీలో ఉన్న సామాగ్రి రోడ్డు పక్కన పడిపోయింది. వెంటనే టోల్‌ప్లాజా సిబ్బంది అక్కడికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. దీనిపై ఎలాంటి ఫిర్యాదు అందలేదని ఎస్‌ఐ ఎం.శ్రీనివాస్ తెలిపారు.



ముంచుకొస్తున్న గడువు



కుమ్మరిగడ్డ తండాలో పనులు ప్రారంభిస్తున్న కమిటీ సభ్యులు (ఫైల్)

- ముందుకు సాగని పనులు
- అడ్వాన్సులు లేక ఆగిన బడుల అభివృద్ధి పనులు

నవాబుపేట: మండలపరిధిలో అమ్మఆదర్శ కమిటీల ఆధ్వర్యంలో ప్రభుత్వం నిర్వహించ తలపెట్టిన పాఠశాలల అభివృద్ధి పనులు ముందుకు సాగడం లేదు. జూన్ 5 లోపు పనులు పూర్తి చేయాలని డెడ్‌లైన్ ఉన్నప్పటికీ వివిధ కారణాల వల్ల ఎలాంటి పురోగతి కనిపించడం లేదు. దీంతో అప్పటిలోగా పనులు పూర్తవుతాయా అనేది ప్రశ్నార్థకంగా మారింది. కాగా ప్రభుత్వం ఇటీవల ఈ కమిటీలు ఏర్పాటు చేసి పాఠశాలల అభివృద్ధికి ప్రణాళికలు చేపట్టింది. అందుకోసం గ్రామాల్లోని మహిళ సంఘాలతో పాఠశాల హెచ్‌ఎంకు జాయింట్ చెక్ పవర్ కట్టబెట్టి పనులు చేపట్టాలని నిర్ణయించింది. అయితే విద్యా సంవత్సరం గడువు ముంచుకొస్తున్నా పాఠశాలలో చేపట్టాల్సిన పనులు ఇంకా ముందుకు సాగడం లేదు. గత విద్యా సంవత్సరం తీసుకున్న డైస్ ప్రకారం పాఠశాలలో పనులు చేయాలని తీర్మానం చేసినప్పటికీ ఎలాంటి పురోగతి కనిపించడం లేదు. మండలంలో మొత్తం 54 గ్రామాలకు సంబంధించి 63 పాఠశాలల్లో అమ్మఆదర్శ కమిటీలు ఏర్పాటు చేశారు. కాగా వాటిలో 46 పాఠశాలలకు మాత్రం డైస్ ప్రకారం అభివృద్ధి పనులు కేటాయించారు. కేవలం 14 పాఠశాలల్లో మాత్రమే ఇప్పటివరకు పనులు ప్రారంభించారు. అయితే పనులు చేపట్టేందుకు సైతం కమిటీలు అవగాహన రాహిత్యంతో ముందుకు రాకపోవటంతో ఇబ్బంది ఏర్పడింది. పనులు ప్రారంభించి పూర్తి చేసిన విధానం ఆధారంగా కమిటీల ఖాతాల్లో డబ్బులు జమచేస్తామని అధికారులు చెప్పటంతో కమిటీలు ముందుగా పనులు చేసేందుకు జంకుతున్నాయి. మండలంలో దాదాపుగా రూ. 1.27 కోట్ల విలువైన పనులకు అంచనాలు ఉన్నట్లు తెలుస్తున్న తరుణంలో వాటిలో ఎక్కువగా.. కేవలం మరమ్మతులకే కేటాయింపులు ఉన్నట్లు సమాచారం. కాగా చేపట్టాల్సిన పనులకు సంబంధించి 25 శాతం నిధులు అడ్వాన్సుగా ఇవ్వనున్నట్లు ప్రభుత్వం ప్రకటించింది. కానీ నేటికి నిధులు విడుదల కాలేదు. దీంతో పనులు పూర్తి చేయాలని ప్రభుత్వం నిర్ణయించిన డెడ్‌లైన్ (జూన్ 5 లోపు) వరకు పనులు పూర్తి కావడమనేది కష్టసాధ్యమేనని పలువురు అభిప్రాయ పడుతున్నారు.

ఆలస్యంగా సాగుతున్నాయి

పాఠశాలల మరమ్మతులో కీలకమైన కమిటీల నిర్వాహకులు మహిళ సంఘాల వారు కావటంతో వారికి కాంట్రాక్టు పనులపై అవగాహన ఉండదు. పైగా పనులు ముందుగానే చేసిన అనంతరం బిల్లులు తీసుకునేందుకు ఎంబీలు సమర్పించాల్సి ఉంటుంది. కానీ సంఘాల వారు తమకు ముందుగా డబ్బులు ఇస్తే పనులు చేస్తామని.. తమ దగ్గర నిధులు లేవని చేతులెత్తేశారు. దీంతోనే పనులు కాస్తా ఆలస్యంగా సాగుతున్నాయి. ప్రభుత్వం వారికి అవగాహన కల్పించటంతో పాటు అడ్వాన్సులు విధిగా చెల్లించాల్సిన అవసరం ఉంది.

–రవిశంకర్, ఉపాధ్యాయుడు

ప్రొసీడింగ్ రావాల్సి ఉంది

అమ్మ ఆదర్శ పాఠశాలల పనులకు సంబంధించి 25 శాతం నిధులు అడ్వాన్సుగా ఇవ్వాలన్న ప్రొసీడింగ్ పెండింగ్‌లో ఉంది. ఎన్నికల నేపథ్యంలో అది సాధ్యం కాలేదు. దీంతోనే పనులు కాస్తా ఆలస్యంగా జరిగే అవకాశం ఉంది. తాజాగా ఎన్నికలు ముగిసిన తరుణంలో త్వరలోనే ప్రొసీడింగ్ వచ్చే అవకాశం ఉంది. కానీ ఈ విద్యా సంవత్సరం ప్రారంభం నాటికి చాలా పాఠశాలలో పనులు పూర్తి చేసి విద్యార్థులకు అందుబాటులో ఉండేలా చూస్తాం.

–నాన్యనాయక్, ఏఈ, పాఠశాలల కమిటీ

కురిసిన వర్షం.. తడిసిన ధాన్యం



వెన్నాచేడ్‌లో కురిసిన వర్షానికి తడిసిన వరిధాన్యం

- పగిడ్యాల్‌లో పాక్షికంగా దెబ్బతిన్న ఇల్లు

గండేడ్: మండల వ్యాప్తంగా బుధవారం కురిసిన వర్షానికి పలు గ్రామాల్లో కల్లాల్లో ఉన్న వరిధాన్యం తడిసి ముద్దయ్యింది. పగిడ్యాల్‌లో శంకరమొల్ల పెద్దబుగ్గయ్య ఇల్లు వర్షానికి పాక్షికంగా దెబ్బతింది. కూలడానికి సిద్ధంగా ఉండడంతో వారు ఇంటి నుంచి బయటికి వెళ్లిపోయారు. మండల వ్యాప్తంగా వెన్నాచేడ్, రంగారెడ్డిపల్లి, సల్కర్‌పేట్, జానంపల్లి తదితర గ్రామాల్లో ధాన్యం తడవటంతో పాటు మామిడి కాయలు నేలరాలాయి. వరిధాన్యం కొనుగోలు కేంద్రాల్లో నిర్వాహకులు టార్పాలిన్ కవర్లు ఇవ్వకపోవడంతో అవస్థలు పడాల్సి వచ్చిందని రైతులు ఆరోపిస్తున్నారు.

అసంపూర్తిగా డబుల్ రోడ్డు

- ఏళ్లు గడుస్తున్నా పూర్తికాని పనులు



గుండేడ్‌లో ముద్దాయి చెరువు అలుగువద్ద..



ఏకలవ్య గురుకులం వద్ద అసంపూర్తిగా ఉన్న డబుల్ రోడ్డు

బాలానగర్: మండలపరిధిలోని ఉడిత్యాల డబుల్‌రోడ్డు పనులు ఏళ్లు గడుస్తున్న పూర్తికావడం లేదు. అప్పట్లో ఈ రోడ్డును డబుల్‌గా మార్చేందుకు నాటి ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి చేతుల మీదుగా పనులు ప్రారంభించారు. కాగా మండల పరిధిలోని పెద్దయాపల్లి ముఖ్య కూడలి జాతీయరహదారి–44 నుంచి గుండేడ్, ఈదమ్మగడ్డ తండా, ఉడిత్యాల గ్రామాల మీదుగా వీరన్నపల్లి, వీరన్నపల్లి తండా వరకు.. ప్రధానమంత్రి గ్రామీణ సడక్ యోజన పథకం ద్వారా 11 కిలోమీటర్ల మేర రెండు వరుసలుగా దారి ఏర్పాటుకు ఈ పనులు చేపట్టారు. నాటి నుంచి పనులు నత్తనడకన సాగాయి. 2021 జూన్‌లో ప్రారంభమైన ఈ పనులు నేటికి పూర్తి కాకపోవడం గమనార్హం. ముఖ్యంగా పెద్దాయపల్లి గ్రామం రెవెన్యూ పరిధిలోని ఏకలవ్య గురుకుల వద్ద భారీ పైప్‌లతో బ్రిడ్జి నిర్మాణం, ముద్దాయి చెరువు వద్ద వంతెన నిర్మాణం, ఉడిత్యాల గ్రామంలో సీసీ రోడ్డు నిర్మాణంతో రెండు వరుసల పనులు చేయాల్సి ఉంది. అయితే వర్షాలతో భారీ వాహనాల రాకపోకలకు ప్రత్యామ్నాయ మార్గం లేదని చెబుతూ ఏకలవ్య గురుకులం, ముద్దాయిచెరువు వద్ద బ్రిడ్జి నిర్మాణం, ఉడిత్యాలలో రెండు వరుసల సీసీరోడ్డు వేయకుండానే వదిలేశారు. ఈ విషయాలపై గతంలో బీటీ పూర్తి కాలేదని తీవ్ర దుమ్ము రేగుతుందని పలుమార్లు సాక్షిలో కథనాలు రావడంతో వేసిన కంకర్పై ఒకలైన్ బీటీ వేసి వదిలేశారు. రోడ్డు నిర్మాణం పూర్తి చేయకుండా వదిలేయడం, అక్కడక్కడా సింగిల్ రోడ్డును డబుల్‌గా మార్చకపోవడం, ఎక్కడా కూడా ఎలాంటి సూచిక బోర్డులు ఏర్పాటు చేయకపోవడం, ఉన్న రోడ్డు అక్కడక్కడా అసంపూర్తి నిర్మాణంతో గుంతలుగా ఉండడంతో నూతనంగా ఆ రహదారి గుండా వచ్చిన ద్విచక్ర వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. ఇప్పటికైనా రోడ్డును పూర్తిచేయాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

రోడ్డును పూర్తి చేయాలి

నిత్యం బాలానగర్‌కు ద్విచక్ర వాహనంపై వస్తూ పోతూ ఉంటాం. రెండు వరుసల బీటీ పూర్తి కాకపోవడంతో నూతనంగా ఈ రోడ్డు గుండా వచ్చిన పలువురు ప్రమాదాలబారిన ఘటనలు ఎన్నో ఉన్నాయి. దీంతో చాలామంది ఆస్పత్రుల పాలయ్యారు. ఎక్కడా సూచిక బోర్డులు లేవు. ఇప్పటికైనా బ్రిడ్జి నిర్మాణం పూర్తి చేసి బీటీరోడ్డును సైతం అందుబాటులోకి తీసుకురావాలి.

– మేఘావత్ రాజు, గుడిబండ తండా

నిధుల కొరత వల్లే పెండింగ్

పెద్దాయపల్లి ముఖ్య కూడలి నుంచి వీరన్నపల్లి గ్రామం వరకు రెండు వరుసల బీటీ రోడ్డు నిర్మాణంలో భాగంగా ఇప్పటికే ఒక్క వరుస బీటీ పూర్తిచేశాం. మిగతాపనులు పూర్తి చేయాలని కాంట్రాక్టరుకు నోటీస్ కూడా ఇచ్చాం. కాగా చేసిన పనులకు బిల్లులు రాలేదని, కొంతైనా బిల్లు మంజూరైతేనే పనులు తిరిగి ప్రారంభించి పూర్తి చేస్తానని కాంట్రాక్టర్ చెబుతున్నాడు.

–వెంకటేశ్వర్ రెడ్డి, ఏడీఈ

వాల్‌పోస్టర్ విడుదల

మాగనూర్: మండల కేంద్రంలో శ్రీ లక్ష్మీనరసింహాస్వామి బ్రహ్మోత్సవాల వాల్‌పోస్టర్‌ను బుధవారం స్థానిక జెడ్పీఉన్నత పాఠశాల ఆవరణలో ఆలయ కమిటీ సభ్యులు, గ్రామపెద్దలు కలిసి విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీసభ్యులు వాకిటి వాబయ్య మాట్లాడారు. ఈ నెల 25 వరకు వేడుకలు ఉంటాయన్నారు. ఉత్సవాలకు మండల ప్రజలతోపాటు మహారాష్ట్ర, కర్ణాటక తదితర ప్రాంతాల వారు పెద్ద సంఖ్యలో వస్తారని వివరించారు.

నేడు పట్టణంలో విద్యుత్ అంతరాయం

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): పట్టణంలోని ఇండస్ట్రీయల్ ఫీడర్, న్యూటౌన్ ఫీడర్ 11 కేవీ ఫీడర్ మరమ్మతు కారణంగా పట్టణంలో గురువారం విద్యుత్ అంతరాయం ఉంటుందని టౌన్ 3 ఏఈ భగవంతయ్య బుధవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఇందులో భాగంగా ఇండస్ట్రీయల్ ఏరియా, ప్రేమ్‌నగర్, రాఘవేంద్రస్వామి గుడి, అవంతి ఎదురుగా ఉన్న గల్లీ, షాషాబ్‌గుట్ట, న్యూటౌన్, రాజేంద్రనగర్, బాయమ్మతోట, అరబ్‌గల్లీ, వెంటర్నరీ ఆస్పత్రి, ప్రాంతాల్లో ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల దాక విద్యుత్ సరఫరా నిలిచి పోనున్నట్లు తెలిపారు. దీనికి ప్రజలు సహకరించాలని కోరారు.

వేంకటేశ్వరుడికి పూజలు



మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: స్థానిక పిల్లలమర్రి రోడ్‌లోని వేంకటేశ్వర స్వామి ఆలయంలో బుధవారం మున్సిపల్ చైర్మన్ ఎ.ఆనంద్‌కుమార్‌గౌడ్ ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆయనను పూజారులు సన్మానించి ఆశీర్వచనం అందించారు.

లైన్‌మన్‌ను పరామర్శించిన జెడ్పీ చైర్‌పర్సన్



చిన్నచింతకుంట: మండల కేంద్రంలో విద్యుత్ లైన్‌మన్‌గా విధులు నిర్వహిస్తున్న శివ.. నెల 12న గ్రామ సమీపంలోని ట్రాన్స్‌ఫార్మర్ వద్ద పనులు చేస్తూ విద్యుత్ షాక్‌కు గురయ్యాడు. ప్రస్తుతం పాలమూరులోని ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. విషయం తెలుసుకున్న జెడ్పీ చైర్‌పర్సన్ స్వర్ణసుధాకర్‌రెడ్డి బుధవారం ఆస్పత్రికి వెళ్లి శివను పరామర్శించారు. మెరుగైన వైద్యం అందించాలని వైద్యులకు సూచించారు. గంజి బాల్‌రాజు తదితరులు ఉన్నారు.

లింగన్నపల్లి వాసికి డాక్టరేట్



హన్వాడ: మండలపరిధిలోని లింగన్నపల్లికి చెందిన కుమ్మరి ఎల్లప్ప బుధవారం డాక్టరేట్ అందుకున్నారు. ఆచార్య వీరయ్య పర్యవేక్షణలో ఉస్మానియా విశ్వవిద్యాలయం 'పాలమూరు జిల్లా పారమార్థిక గేయాలు' అనే అంశంపై పరిశోధన నేపథ్యంలో ఆయనను డాక్టరేట్ వరించింది. చదువంటే ఎంతో మక్కువ ఉన్న ఎల్లప్పకు చిన్నప్పుడే తల్లిండ్రులు దూరమయ్యారు. అయినా ఎల్లప్ప కూలీ పనిచేస్తూ ఈ స్థాయికి ఎదిగాడని గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు. ప్రస్తుతం కొల్లాపూర్ పీజీ సెంటర్‌లో అతిథి అధ్యాపకుడిగా ఎల్లప్ప విధులు నిర్వర్తిస్తున్నాడు.

సమాచారం ఇవ్వకుండా పనులు!

మహమ్మదాబాద్: గ్రామస్తులకు ఎలాంటి సమాచారం లేకుండా పాఠశాల పనులు చేయడంపై మండల పరిధిలోని సంగాయపల్లి విద్యార్థుల తల్లిదండ్రులు మండిపడుతున్నారు. గ్రామంలోని పాఠశాలకు సంబంధించి తమకు తెలియకుండా అమ్మ ఆదర్శ పాఠశాల చైర్మన్ ఓ వ్యక్తిని ఎంపిక చేశారని ఆరోపించారు. దీంతో వారు పాఠశాలకు వచ్చిన అభివృద్ధి పనులపై ఎలాంటి సమాచారం ఇవ్వకుండా.. ఇష్టానుసారం పనులు చేస్తున్నారని అన్నారు. ఈ మేరకు అధికారులకు ఫిర్యాదు చేశారు.

ప్రభుత్వ కళాశాలలోనే మెరుగైన విద్య



కావేరమ్మపేటలో అవగాహన కల్పిస్తున్న అధ్యాపకబృందం

జడ్చర్ల టౌన్: పట్టణంలోని ప్రభుత్వ కో ఎడ్యుకేషన్ జూనియర్ కళాశాలలో మెరుగైన, ఉచిత నాణ్యమైన విద్యను అందిస్తున్నట్లు ప్రిన్సిపాల్, అధ్యాపకులు పేర్కొన్నారు. బుధవారం 10వ తరగతి పాసైన విద్యార్థుల తల్లిదండ్రులకు ఇంటింటి ప్రచారం చేస్తూ అవగాహన కల్పించారు. తమ కళాశాలలో చేర్పించాలని సూచించారు. మండలంలోని బూర్గుపల్లి, కావేరమ్మపేట గ్రామాల్లో ప్రిన్సిపాల్ ఉమామహేశ్వర్, అధ్యాపకులు మోజెస్, రఘురాం, రామకృష్ణగౌడ్, కరణం రాజు, సురేందర్‌గౌడ్, శ్రీదేవి, రాజేష్, శివానంద్, సౌజన్య, భారతమ్మ, సంతోష్ తదితరులు ఈ మేరకు కార్యక్రమం నిర్వహించారు. ఎలాంటి ఫీజు చెల్లించాల్సిన అవసరం ఉండదని.. ప్రభుత్వమే అన్ని చూసుకుంటుందని వివరించారు.

30శాతం ఫిట్‌మెంట్ ఇవ్వాలని వినతి



వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: ప్రభుత్వం ఇవ్వబోయే పీఆర్సీలో 30 శాతం ఫిట్‌మెంట్ ఇవ్వాలని బీసీటీఏ నాయకులు తెలంగాణ పీఆర్సీ కమిటీ చైర్మన్ శివశంకర్‌కు.. బహుజన టీచర్స్ క్లాస్ అసోసియేషన్ నాయకులు హైదరాబాద్‌లో బుధవారం వినతిపత్రం సమర్పించారు. ఈమేరకు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కృష్ణుడు మాట్లాడుతూ కనీస వేతనం రూ.35 వేలుగా నిర్ణయిస్తూ కనీసం 3శాతం ఇంక్రిమెంట్ ఇవ్వాలన్నారు. ఎస్జీటీలకు, ఎస్సేలకు వేతన వ్యత్యాసం తగ్గించాలని, బీసీ ఉపాధ్యాయులకు ఉన్నత విద్య చదివే వారికి ప్రత్యేక సెలవులు ఇవ్వాలన్నారు. మ్యూచువల్ ట్రాన్స్‌ఫర్స్ అయిన వారికి సర్వీస్ రక్షణ కల్పించాలన్నారు. స్పౌజ్ ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలని, పదవీ విరమణ వయస్సును 58 సంవత్సరాలకు కుదించి, యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలన్నారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లక్ష్మణ్‌గౌడ్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు రాములు, జిల్లా అధ్యక్షుడు గురుప్రసాద్, కార్యదర్శి రాఘవేందర్, ధనుంజయ పాల్గొన్నారు.

తడి, పొడి చెత్తపై అవగాహన



ప్రజలకు వివరిస్తున్న మున్సిపల్ సిబ్బంది మహేందర్

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: స్థానిక 17వ వార్డు పరిధిలోని దొడ్డలోనిపల్లిలో బుధవారం తడి, పొడి చెత్తపై ప్రజలకు మున్సిపల్ సిబ్బంది అవగాహన కల్పించారు. ఇంటింటికీ వచ్చే స్వచ్ఛ ఆటోలకు తడి, పొడి చెత్తను వేరు చేసి ఇవ్వాలని సూచించారు. చెత్తా చెదారం ఎక్కడబడితే అక్కడ వీధుల్లో పడేయొద్దన్నారు. కార్యక్రమంలో స్వచ్ఛ భారత్ మిషన్ (ఎస్‌బీఎం) కన్సల్టెంట్ సుమీత్‌రాజ్, మున్సిపల్ సిబ్బంది మహేందర్ తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా బెల్టు గ్రేడింగ్ పరీక్షలు



బ్లాక్‌బెల్టులు పొందిన విద్యార్థులు

మహబూబ్‌నగర్ క్రీడలు: విద్యార్థులు చదువుతో పాటు కరాటే మార్షల్‌లో రాణించాలని సిరి చిల్డ్రన్స్ హాస్పిటల్ డాక్టర్ రాఘవేంద్రకుమార్ అన్నారు. స్థానిక అప్పన్నపల్లిలోని కమ్యూనిటీహాల్‌లో బుధవారం జీకే మాస్టర్ షోటోకాన్ పట్టణ ఉపాధ్యక్షులు, సీనియర్ కరాటే మాస్టర్ నవీన్‌కుమార్ ఆధ్వర్యంలో... కరాటే బ్లాక్‌బెల్టు గ్రేడింగ్ పరీక్షలు నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న డాక్టర్ రాఘవేంద్రకుమార్ విద్యార్థులను అభినందించి మాట్లాడారు. పరీక్షలను జీకే మాస్టర్ షోటోకాన్ ఫౌండర్ చీఫ్ జి.క్రిష్ణయ్య పర్యవేక్షించారు. విద్యార్థులు రాష్ట్ర, జాతీయస్థాయి పోటీల్లో రాణిస్తుండడం సంతోషంగా ఉందన్నారు. మాస్టర్ నవీన్‌కుమార్ మాట్లాడుతూ బెల్టు గ్రేడింగ్ పరీక్షలో 12 మంది విద్యార్థులు బ్లాక్‌బెల్టులు అందుకున్నట్లు తెలిపారు. ప్రొవిజనల్ బ్లాక్‌బెల్టులను నందిని, భవ్యసాయి శ్రీ, ఎస్.భవ్యశ్రీ, జ్యోష్న, కె.అక్షర, పి.అక్షర, హృతిక్ కుమార్ దుర్గా, సాయి వర్షిని, ఎం.నందిని, కన్ఫర్మేషన్ బ్లాక్‌బెల్టులను ఎస్.అభినవ్, నవతేజ పొందినట్లు తెలిపారు. అదే విధంగా బ్లాక్‌బెల్టు ప్రమోషన్‌ను ఎం.నందిని, కె.అక్షర సాధించినట్లు తెలిపారు. ఏఎస్‌ఐలు నరేందర్‌గౌడ్, యాదయ్య, మాస్టర్లు శివకుమార్, నవీన్ పాల్గొన్నారు.

ఆరాధన మహోత్సవాలకు ఏర్పాట్లు



వీరబ్రహ్మేంద్ర స్వామి, అమ్మవారు

స్టేషన్ మహబూబ్‌నగర్: జిల్లా కేంద్రం తెలంగాణ చౌరస్తాలోని శ్రీపోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయంలో గురువారం నుంచి 18 వరకు స్వామివారి ఆరాధన, గురుపూజా మహోత్సవాలు నిర్వహించనున్నట్లు.. దేవస్థానం అభివృద్ధి కమిటీ చైర్మన్ వడ్ల శేఖరాచారి, అధ్యక్షుడు ప్రభాకరాచారి, ప్రధాన కార్యదర్శి వి.నారాయణ తెలిపారు. మహోత్సవాలకు సంబంధించి అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. మహోత్సవాల్లో భాగంగా గురువారం స్వామివారి సుప్రభాతం నామ సంకీర్తన, ధ్వజారోహణం, పుణ్యాహవాచనం, కలశస్థాపన, గణపతిపూజ, అదే విధంగా రెండు రోజుల భజన పోటీలు ప్రారంభమవుతాయన్నారు. 17న శ్రీవీరబ్రహ్మేంద్రస్వామి, శ్రీవేంకటేశ్వరస్వామి, శ్రీశివలింగ ఆంజనేయస్వామివార్లకు అభిషేకం, విశేష పూజలు, హోమం, కుంకుమార్చన, భజనలు పోటీలు, స్వామివారి రథోత్సవం ఊరేగింపు నిర్వహించనున్నట్లు తెలిపారు. 18న శ్రీగోవిందమాంబ సమేత శ్రీవీరబ్రహ్మేంద్రస్వాములవారు, వివిధ దేవతా మూర్తులకు ప్రత్యేక పూజలు, ధార్మికోపన్యాసములు, భజనలతోపాటు ఇతర సాంస్కృతిక కార్యక్రమాలు జరుగుతాయని వివరించారు.

'ఉపాధి పనుల వద్ద సౌకర్యాలేవి?'



సంగీతను పరామర్శిస్తున్న నాయకులు

మహబూబ్‌నగర్ రూరల్: మండలంలోని కోడూర్ గ్రామానికి చెందిన ఉపాధికూలీ సంగీత పని ప్రదేశంలో గడ్డపార కాలుపై పడడంతో మంగళవారం తీవ్రంగా గాయపడ్డారు. దీంతో ఆమెను జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. విషయం తెలుసుకున్న సీఐటీయూ జిల్లా కార్యదర్శి నల్లవెల్లి కురుమూర్తి, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కడియాల మోహన్‌లు బుధవారం ఆస్పత్రికి వెళ్లి ఆమెను పరామర్శించారు. గాయానికి గల కారణాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లాలో ఉపాధిహామీ పథకంలో పనిచేసే కూలీల పని ప్రదేశాలలో కూలీలకు ప్రథమ చికిత్స నిమిత్తం ఎలాంటి సౌకర్యాలు ఏర్పాటు చేయలేదని ఆరోపించారు. సంగీత తీవ్రంగా గాయపడిందని, ఆమెకు మెరుగైన వైద్యం అందించడంతో పాటు చికిత్స కాలం మొత్తం రోజులు కూలీ డబ్బులు చెల్లించాలని డిమాండ్ చేశారు.

శిక్షణ శిబిరం ప్రారంభం



మహబూబ్‌నగర్ క్రీడలు: న్యూమాంక్స్‌కుంగ్‌ఫూ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రం న్యూమోతీనగర్‌లోని ఆదిత్య హై స్కూల్‌లో బుధవారం వేసవి కుంగ్‌ఫూ కరాటే శిక్షణా శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఉమ్మడి జిల్లా న్యూమాంక్స్ కుంగ్‌ఫూ అధ్యక్షులు ఎస్.ప్రభాకర్ మాట్లాడుతూ వేసవి కరాటే శిక్షణ శిబిరాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కరాటే నేర్చుకోవడం వల్ల ఆత్మస్థైర్యం పెంపొందుతుందన్నారు. ప్రతి విద్యార్థి కరాటే శిక్షణ తీసుకోవాలని, తద్వారా తమను తాము రక్షించుకుంటూ పక్కవారిని రక్షించవచ్చని అన్నారు. జూన్ 12 వరకు ఈ కరాటే శిక్షణ కొనసాగుతుందని తెలిపారు. ప్రతి రోజు ఉదయం 6.15 గంటల నుంచి 7.30 గంటల వరకు కరాటే శిక్షణ ఉంటుందన్నారు. కార్యక్రమంలో కుంగ్‌ఫూ మాస్టర్ కనకం యాదవ్, భరత్, నరేష్, గణేష్, రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.